**సందేశం**

## 2021 జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు

## అమరుల సంస్మరణ వారాన్ని పాటించండి!

ప్రజా వీరులు మృత్యుంజయులు!

మీ త్యాగాల పల్లకిని మోసే బోయిలం మీ ఆశయాల

సాధనకై అంకితమవుతాం!

వర్గ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని దేశవ్యాప్తంగా

తీవ్రతరం-విస్తృతం చేయడం ద్వారా

శత్రువు కొనసాగిస్తున్న 'సమాధాన్'-'ప్రహార్' దాడులను ఓడిద్దాం!

పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ కమాండర్లు, యోధులకు,

విప్లవ ప్రజా ప్రభుత్వాలకు, ప్రజా సంఘాల నాయకులకు,

కార్యకర్తలకు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు,

సమస్త పీడిత ప్రజానీకానికి

సీ.పీ.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు!

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# అమరుల త్యాగాలను వృథా కానివ్వం, మీ త్యాగాల స్ఫూర్తితో మునుముందుకు సాగుతాం!

# వర్గ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని దేశవ్యాప్తంగా తీవ్రతరం-విస్తృతం చేయడం ద్వారా

# శత్రువు కొనసాగిస్తున్న 'సమాధాన్'-'ప్రహార్' దాడులను ఓడిద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా**

విప్లవ దినాల నిర్వాహణలో 28 జులై ప్రత్యేకంగా చెప్పుకోదగిన ప్రాధాన్యత కలిగినటువంటిది. ఈ రోజు మనం దేశ, ప్రపంచ పీడిత ప్రజల విముక్తి కోసం తమ అముల్యమైన ప్రాణాలను ధారబోసిన అమరులందరిని శ్రద్ధతో గౌరవ భావంతో గుర్తు చేసుకుంటాం, వారి ఆశయాలను తుదకంటా కొనసాగించడానికి శపథం చేస్తాం. ఈ సందర్భంగా భారత విప్లవ మహానాయకులు మన పార్టీ సంస్థాపక నాయకులు అధ్యాపకులు, అమరులు కామ్రేడ్స్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీ, నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం నుండి నేటి వరకు భారత నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అంతిమంగా సోషలిజం, కమ్యూనిజం స్థాపన లక్ష్యంగా తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులందరికీ, విప్లవ ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా విప్లవోద్యమాలలో, జాతీయ విముక్తి ఉద్యమాలలో అత్యున్నత త్యాగాలు చేసిన అమరులందరికీ మా కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నది. విప్లవాభివందనాలు చెపుతున్నది. వారి ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామని ప్రతిన బూనుతున్నది. గత సంవత్సర కాలంలో అమరులైన 160 మంది కామ్రేడ్స్‌ను ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటున్నది. వీరందరికి పేరుపేరున శ్రద్ధాంజలి అర్పిస్తున్నది. ఈ అమరుల స్మృతిలో 2021 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని వారి త్యాగాల స్ఫూర్తితో విప్లవోత్సహంతో జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ బలగాలకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మేధావులకు సమస్త పీడిత వర్గాల, ప్రత్యేక సామాజిక సెక్షన్ల ప్రజలకు పిలుపునిస్తున్నది.

వర్గ సమాజ చరిత్రలో మొట్టమొదటిసారి దోపిడీ పాలక వర్గాల రాజ్యాధికారాన్ని కూలదోసి కార్మికవర్గ రాజ్యాధికార సంస్థగా స్థాపించబడిన పారిస్ కమ్యూన్‌కు ఈ సంవత్సరంతో 150 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. అది 72 రోజులు మాత్రమే జీవించి వున్నప్పటికీ పీడిత

వర్గాలలో, ప్రత్యేకించి కార్మికవర్గంలో తమ రాజ్యాధికారాన్ని స్థాపించుకోగలమనే ఒక కొత్త ఆశను చిగురింపజేసింది. అలాగే వారిని విశ్వాసంతో నింపింది. పారిస్ కమ్యూన్ ఓటమి నుండి గుణపాఠాలు తీసుకొని రష్యా, చైనా సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కార్మికవర్గ విప్లవాలు విజయవంతమయ్యాయి, సోషలిస్టు వ్యవస్థల నిర్మాణం జరిగింది. అయితే పార్టీలో రివిజనిజం తలెత్తడంతో ఈ విప్లవాలన్ని ఓడిపోయాయి. సోషలిజం, కమ్యూనిజం స్థాపించే లక్ష్యంతో విప్లవోద్యమాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పారిస్ కమ్యూన్ 150వ వార్షికోత్సవ ప్రత్యేక సందర్భంగా దాని స్ఫూర్తి, ప్రేరణలతో భారతదేశంలో ప్రజా రాజ్యాధికార సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఈ విప్లవ ప్రజా కమిటీలను (రివల్యూషనరీ పీపుల్స్ కమిటీస్) కాపాడుకోవడం, బలోపేతం చేసుకోవడం, వీటిని విస్తరించడం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుదాం. పారిస్ కమ్యూన్‌ను స్థాపించడం కోసం జరిగిన యుద్ధంలో, దాన్ని కాపాడుకోవడం కోసం జరిగిన ప్రయత్నాల్లోను, దాని ఓటమి తర్వాత ఫ్రాన్స్ పెట్టుబడిదారీ వర్గం నిర్వహించిన నరమేధంలో ప్రాణాలు అర్పించిన కార్మికవర్గ నాయకులను, కార్మికులను ఈ సందర్భంగా స్మరించుకుందాం, వారికి విప్లవ జోహార్లు అర్పిద్దాం.

వర్గ పోరాటం, ప్రజాయుద్ధంలో అమరత్వం సాధారణ విషయమే. అమరుల త్యాగాల ఫలితంగానే వర్గ పోరాటం, ప్రజాయుద్ధం తీవ్రతరం అవడంతో పాటు దాని విస్తృతి పెరిగింది. నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాట కాలం నుండి శత్రు దాడులను ఎదుర్కొనడం మొదలైంది. శత్రువుకు వ్యతిరేకంగా ఆచారణాత్మకమైన సిద్ధాంత సూత్రీకరణ, భావాజాలపరమైన స్పష్టతతో కూడిన వైఖరి, లక్ష్యం పట్ల అంకిత భావాన్ని, త్యాగ సంసిద్ధతకు సంబంధించిన చైతన్యాన్ని పెంపొందించాయి. ఈ చైతన్యంతో నిండిన యువతి, యువకులు పార్టీ నాయకత్వంలో ఈ దేశ విప్లవానికి తమ నెత్తురు చిందిస్తున్నారు. శత్రువుకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో కొన్నిసార్లు మన పార్టీ తాత్కాలిక ఓటమిని ఎదుర్కొన్నది కానీ అది ఎప్పుడు కూడా ఎర్రజెండా గౌరవానికి, దాని ప్రతిష్టకు, ఎలాంటి భంగం కలగనీయలేదు. ఓటమి నుండి గుణపాఠాలు తీసుకుంటూ అమరుల త్యాగాలందించిన విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగింది. మనం నక్సల్బరీ వారసులం. దాని ప్రేరణతో మొదలైన రెండు ప్రవాహాల –భాకాపా మాలె పీపుల్స్ వార్, ఎమ్‌సీసీఐ లు ఒకే మహా ప్రవాహంగా కలయికతో ఏర్పడిందే మన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు). ఇది వేలాది అమరుల వెలకట్ట లేని త్యాగాలతో భారత నూతన ప్రజాస్వామ్య విప్లవానికి నాయకత్వం వహిస్తున్నది. మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిజం, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో భవిష్యత్తు గెలుపు పట్ల ఆశ, విశ్వాసంతో అమరులు తమ ప్రాణాలను ధారబోశారు.

అమరుల వారోత్సవాల సందర్భంగా తెలంగాణలోని ఇంద్రవెల్లిని స్మరించుకుందాం. తెలంగాణలోని అదిలాబాద్ జిల్లాలో ఇంద్రవెల్లి గిరిజన సభపై పాశవిక హత్యకాండకు ఈ

సంవత్సరం 40 యేళ్ళు పూర్తయ్యాయి. ఇంద్రవెల్లి హత్యకాండ ఒకవైపు, ఆదివాసుల పట్ల దోపిడీ పాలకవర్గాల క్రూరత్వానికీ, పాశవికతకు చిహ్నంగా వుంటే మరోవైపు ఆదివాసుల హక్కుల పోరాటానికి ప్రతీకగా నిలిచింది. జల్ జంగల్ జమీన్, అధికారం కోసం ఆదివాసీ ఉద్యమాలపై, ఆదివాసీ పోరాటకారులపై హత్యకాండ యీనాటికి కొనసాగుతున్నది. దండకారణ్యంలోని బస్తర్ జిల్లా, సిల్గేర్ క్యాంపు వ్యతిరేక ఆదివాసీ ఉద్యమం, మే 17న దానిపై కాల్పులు జరిపి 5 గురు నిరాయుధులైన ఆదివాసీ ప్రజల హత్య ఇందుకు తాజా ఉదాహరణ. ఈ హత్యకాండకు 14 యేళ్ల మైనర్ బాలుడు కూడా బలయ్యాడు. ఈ అన్ని హత్యకాండలలో ప్రాణాలు కోల్పోయిన ప్రజలను ఈ సందర్భంగా స్మరించుకుందాం.

గత సంవత్సర కాలంలో దేశ వ్యాప్తంగా మన పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజా నిర్మాణాలకు సంబంధించిన మొత్తం 160 మంది కామ్రేడ్స్ అమరులైనారు. వీరిలో బీజేలో 11 మంది, డీకేలో 101, ఒడిశాలో 14, ఎమ్ఎమ్‌సీలో 8 మంది, ఏఓబీలో 11, పశ్చిమఘాటిలో ఒకరు, తెలంగాణలో 14 మంది అమరులయ్యారు. వీరిలో 30 మంది మహిళ కామ్రేడ్స్ వున్నారు. అమరులైన కామ్రేడ్స్‌లో ఒకరు కేంద్రకమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ యాప నారాయణ(హరిభూషన్, లక్కు), ఒకరు ఎస్‌జెడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ పవన్(డీకే); 11 మంది డీవీసీ/సీవైపీసీ స్థాయి కామ్రేడ్స్ - కామ్రేడ్ సంతోష్ యాదవ్(ఆలోక్ జోనల్ కమాండర్–బీజే, కామ్రేడ్ ఆత్రం సురేష్(అజిత్, సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్), కామ్రేడ్ మనిరామ్ వెడదా(సోమ్‌జీ, డివిజనల్ కమాండర్ ఇన్ చీఫ్–డీకే), కామ్రేడ్ హీరసింగ్ కుమ్మేటి(వర్గేష్, డీవీసీఎమ్–డీకే), కామ్రేడ్ రుక్నీ (నిర్మల, డీవీసీఎమ్/గుంసర్ ఏరియా ఇన్‌చార్జ్–ఒడిశా), కామ్రేడ్ గడ్డం మధుకర్(శోభరాయ్, డీవీసీఎమ్, దక్షిణ సబ్‌జోన్ కమ్యూనికేషన్ టీం ఇన్‌చార్జ్–డీకే), కామ్రేడ్ ఉద్వే మొహందా(సతిష్, సీవైపీసీఎమ్, కంపెని–10, డీకే), కామ్రేడ్ రవిందర్ (డీవీసీఎమ్–ఒడిశా), కామ్రేడ్ సందే గంగన్న(అశోక్, డీవీసీఎమ్–ఏఓబీ), కామ్రేడ్ మాడవి ముఖేష్(రణదేవ్, డీవీసీఎమ్–ఏఓబీ); సీనియర్ పార్టీ సభ్యుడు కామ్రేడ్ ప్రకాశ్, (దామా దాదా కత్తి మోహన్‌రావు–డీకే), 37 మంది ఏసీ/పీపీసీ సభ్యులు, 35 మంది కామ్రేడ్స్ పార్టీ సభ్యులు, 11 మంది కామ్రేడ్స్ పీఎల్‌జీఏ సభ్యులు, 22 మంది కామ్రేడ్స్ ప్రజా నిర్మాణాల నాయకులు/కార్యకర్తలు, (మిలీషియా కమాండర్స్/సభ్యులు), (ఆర్‌పీసీ అధ్యక్షులు/సభ్యులు), (ప్రజాసంఘాల కార్యకర్తలు/సభ్యులు), 15 మంది విప్లవ సానుభూతిపరులు, విప్లవ ప్రజలు వున్నారు. 27 గురు కామ్రేడ్స్ వివరాలు అందాల్సి వుంది. వీరే కాకుండా దేశవ్యాప్తంగా 20 మంది ప్రగతిశీల, ప్రజాస్వామిక ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విప్లవ సానుభూతిపరులు, మిత్రులు మృత్యుపాలయ్యారు. వీరిలో 95 మంది శత్రువు దాడుల్లో, పీఎల్‌జీఏ శత్రువుపై చేసిన దాడుల్లో శత్రువుతో వీరోచితంగా పోరాడుతు అమరత్వాన్ని పొందారు. కాగా బూటకపు ఎన్‌కౌంటర్లలో 42 మంది, ప్రమాదాలలో 5 గురు, వివరాలు అందని కామ్రేడ్స్ 5 గురు,

అనారోగ్యాలతో 13 మంది కామ్రేడ్స్ అమరులయినారు.

కేంద్రకమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్రకమిటీ కార్యదర్శి కామ్రేడ్ యాప నారాయణ(హరిభూషన్, లక్కు) 2021 జూన్ 21 నాడు ఉదయం 9 గంIIలకు, కరోనా వ్యాధి సోకి గుండెపోటుతో తుదిశ్వాస విడిచాడు. ఆయన ప్రస్తుతం మహబూబ్‌బాద్ జిల్లా(ఉమ్మడి వరంగల్ జిల్లా), గంగారం మండలం, మడగూడెం గ్రామంలో 1960 దశకం చివరిలో ఆదివాసీ రైతు కుటుంబంలో జన్మించాడు. ఉన్నత విద్యాభ్యాసానికై జిల్లా కేంద్రానికి వెళ్లిన నారాయణ అక్కడే విప్లవ రాజకీయాలను నేర్చుకున్నాడు. ఆ తరువాత ఐటీడీఏ ఉద్యోగం చేసుకుంటు వుండిన కామ్రేడ్ నారాయణ వరంగల్ జిల్లా విద్యార్థి ఉద్యమం, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల ప్రభావంతో, మహబూబ్‌బాద్ ప్రాంతంలో మితవాద ప్రజాపంథా వారి దివాళాకోరు రాజకీయాలు, వారి ప్రజా వ్యతిరేక దౌర్జన్యకర పద్ధతులకు వ్యతిరేకంగా ఆయన మావోయిస్టు రాజకీయాలతో దృఢంగా మమేకమయ్యాడు. ఆ విధంగా 1988లో ఉద్యోగాన్ని వదిలి పూర్తికాలం విప్లవకారుడిగా సిద్ధమై 1990 వరకు రాడికల్ యువజన సంఘంలో పనిచేసాడు. 1990లో పార్టీ నిర్ణయం మేరకు గెరిల్లా దళంలో చేరాడు. 1992 నుండి 1996 వరకు పాండవ దళ కమాండర్‌గా బాధ్యతలను నిర్వర్తించాడు. 1992లో పార్టీ నిర్వహించిన సైనిక శిక్షణ శిభిరంలో విద్యార్థిగా పాల్గొన్నాడు. 1995లో నిర్వహించబడిన ఉత్తర తెలంగాణ తొలి మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నాడు. అప్పటికి ఆయన ఏరియా కమిటీ కార్యదర్శి. 1996లో ఆయన డీవీసీ స్థాయి కామ్రేడ్‌గా పదొన్నతి పొందాడు. 1998 చివరలోప్లాటూన్‌కు కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. ప్రజల విశ్వాసాన్ని చురగొన్న మంచి ఆర్గనైజర్‌గానే కాకుండా పలు సైనిక చర్యల్లో పాల్గొని జయప్రదం చేసి, మంచి కమాండర్‌గా కూడ ఎదిగివచ్చాడు. కేంద్రకమిటీ నూతనంగా ఏర్పాటు చేసిన రక్షణ ప్లాటూన్‌కు కమాండర్‌గా 2000 నుండి 2005 వరకు కామ్రేడ్ లక్కు పేరుతో బాధ్యతలు నిర్వర్తించాడు. కేంద్ర నాయకత్వ రక్షణ బాధ్యతల్లో అత్యంత విశ్వాసనీయమైన కామ్రేడ్‌గా, నైపుణ్యం గల కమాండర్‌గా రానించిన కామ్రేడ్ లక్కు సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీమ్ సభ్యుడయ్యాడు. 2005 చివరిలో తెలంగాణ రాష్ట్రకమిటీ సభ్యుడి స్థాయిలో ఆయన తిరిగి తెలంగాణాకు బదిలి అయ్యాడు. 2015లో కామ్రేడ్ లక్కు తెలంగాణ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. 2018 లో జరిగిన సీసీ 6వ సమావేశం ఆయనను కేంద్రకమిటీలోకి కోఆప్ట్ చేసుకుంది. కామ్రేడ్ లక్కు 2007లో జరిగిన తెలంగాణ స్పెషల్‌జోనల్ మహాసభలో చేపట్టిన తెలంగాణ ఉద్యమ పునరాభివృద్ధి కర్తవ్యాల అమలుకు తుదిశ్వాస వరకు అలుపెరుగని కృషి చేసాడు. తెలంగాణ రాష్ట్ర విభజనోద్యమ 2వ అలను ఉపయోగించుకుని ప్రజాస్వామిక తెలంగాణ సాధన వైఖరిని పార్టీ వైపు నుండి ప్రజా ఉద్యమం ముందుంచడంలో, ఆ దిశలో విప్లవ ప్రజా సంఘాలను, ఐక్య కార్యచరణను మొదట ఉత్తర తెలంగాణ రాష్ట్రకమిటీ సభ్యుడిగాను, ఆ తరువాత తెలంగాణ రాష్ట్రకమిటీ కార్యదర్శిగాను

గైడ్ చేశాడు. 2014 జూన్ 2న భౌగోళిక తెలంగాణ ఏర్పడినపుడు ఆ ప్రజా విజయాన్ని ఎత్తిపడుతూనే, ప్రజాస్వామిక తెలంగాణ సాధన దిశలో మరింత చొరవ పట్టుదలతో పనిచేయాల్సిన అవసరాన్ని రాష్ట్రకమిటీ గుర్తించి ఆ కర్తవ్య సాధనకై తన పనిని కేంద్రికరించింది. 2015 నుండి తన చివరి శ్వాసవరకు కామ్రేడ్ లక్మ ఈ కృషిలో నిమగ్నమయ్యాడు. రాష్ట్రసాధనలో సాధించిన విజయాలను సంఘటితపరుకుంటూ, ప్రజాసంఘాలలో ఎదిగివచ్చిన వారిని పార్టీలో సంఘటితపరుస్తూ, రహస్యపార్టీ నిర్మాణం, విప్లవోద్యమంలో నూతన క్యాడర్ల భర్తీకై నిరంతరం శ్రమించాడు. ఈ క్యాడర్ల భర్తీ నుండి ఎంపిక చేసిన వారిని పార్టీ ఇతర అవసరాల కోసం కూడా కేటాయించారు. ఈ క్రమంలో 2020 చివరి నాటికి తెలంగాణ ఉద్యమం వెనుకంజ నుండి బయటపడుతున్న స్థితికి చేరిందని కేంద్రకమిటీ 6వ కొనసాగింపు సమావేశం అంచన వేసింది.

కామ్రేడ్ లక్మ దండకారణ్య ఉద్యమానికి రాజకీయ, ప్రచార పాదార్థిక రూపాలలో అన్ని రకాల సహాయాన్ని అందించడానికి తీవ్రంగా కృషి చేశాడు. సీసీ 6వ కొనసాగింపు సమావేశం ఫైనల్ చేసిన 14 సం။ల సీసీ పీఓఆర్ సహా వివిధ పార్టీ డాక్యుమెంట్లపై చర్చలలో కామ్రేడ్ లక్మ చాలా చురుగ్గా పాల్గొన్నాడు. ఆయన ప్రజలను చాలా అమితంగా ప్రేమించేవాడు. నిరంతర అధ్యాయన శీలి. మంచి నేర్పరైన సైనిక జనరల్. మూడు దశాబ్దాలకు పైగా విప్లవానుభవం కలిగిన, దృఢ సంకల్పంతో పనిచేసే ఆచరణ శీలి, యువ నాయకత్వ కామ్రేడ్ లక్మ అమరత్వం భారత విప్లవోద్యమానికి తక్షణం పూడ్చుకోలేని లోటు.

కామ్రేడ్ పవన్ డీకేఎస్‌జెడ్‌సీ సభ్యునిగా, పశ్చిమ సబ్‌జోనల్ బ్యూరో సభ్యునిగా, ఉత్తర గఢ్‌చిరోలీ డీవీసీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తు, శత్రువు చేసిన ఒక దాడిని గట్టిగా ప్రతిఘటిస్తూ తోటి కామ్రేడ్స్‌ను రక్షించడం కోసం అంతిమ శ్వాస వరకు పోరాడుతు అమడయ్యాడు. గత 23 సంవత్సరాలుగా దండకారణ్య విప్లవోద్యమానికి కామ్రేడ్ పవన్ అందించిన సేవలు ఎంతో ప్రాధాన్యత కలిగినవి. పశ్చిమ సబ్‌జోన్ గఢ్‌చిరోలి ఉద్యమపు ప్రతి మలుపుతో ఆయన జీవితం విడదీయరానంతగా పెనవేసుకుపోయింది. మొదట దక్షిణ గఢ్‌చిరోలీ డీవీసీ కార్యదర్శి బాధ్యతలను కూడా నిర్వహించాడు. ఒక సాధారణ ఆదివాసీ కుటుంబంలో జన్మించిన పవన్ 2015లో నిర్వహించబడిన దండకారణ్య స్పెషల్ జోన్ 4వ కాన్ఫరెన్స్ 2వ ప్లీనంలో డీకేఎస్‌జెడ్‌సీ ప్రత్యామ్నయ సభ్యునిగా ఎన్నికయ్యాడు. అటు పిమ్మట 2017లో ఎస్‌జెడ్‌సీ సభ్యుడయ్యాడు.

గత సంవత్సర కాలంగా వివిధ స్పెషల్‌జోన్/స్పెషల్ ఏరియా/రాష్ట్రాలలో ఈ నష్టాలు అనేక విధాలుగా జరిగాయి. ఈ అమరత్వాలను విశ్లేషించి, సంశ్లేషించి మనం అవసరమైన గుణపాఠాలు తీసుకుని వాటిని ఖచ్చితంగా అమలు చేస్తూ అనవసర నష్టాల నుండి బయటపడాలి. ఎందుకంటే మనం ఒక బలవంతుడైన శత్రువుతో పోరాడుతున్నాం. అందుకని ప్రస్తుతం తక్కువ సంఖ్యలో వున్న మన శక్తులను వీలైనంత వరకు కాపాడుకుంటూ క్రమంగా

పెంపొందించుకుంటూ శత్రు బలగాలను ముక్కలు ముక్కలుగా నిర్మూలిస్తూ ముందుకు సాగాల్సి వుంటుంది.

శత్రువు విప్లవ ప్రతిఘాతుక 'సమాధాన్' దాడులను ఎదుర్కొనడం కోసం మనం మన వ్యూహాత్మక ప్రాంతాలలో నిర్వహించిన ఎత్తుగడలపరమైన ఎదురుదాడులలో, ప్రతిఘటన కార్యక్రమాలలో వాటిని విజయవంతం చేయడంలో భాగంగా ఎందరో కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరు సాహసోపేతంగా, వీరోచితంగా శత్రు బలగాలతో పోరాడుతూ తమ ప్రాణాలను త్యాగం చేయడం మనకు అనుకరణీయమైంది. వీరి త్యాగాల ఫలితంగానే మనం ప్రజా యుద్ధంలో పేర్కొనదగిన విజయాలు సాధించాం. శత్రువు మనపై చేసిన దాడులను ధైర్య సాహసాలతో ఎదుర్కొంటూ గత సంవత్సర కాలంలో మన ఎందరో కామ్రేడ్స్ తమ ప్రాణాలను త్యాగం చేశారు. దండకారణ్యంలోని జీరగూడెంలో 3 ఏప్రిల్ 2021న శత్రు బలగాలకు చెందిన 756 మంది 'సమాధాన్', 'ప్రహార్' దాడుల్లో భాగంగా మన గెరిల్లా బేసుల్లోకి చొరబడినప్పుడు వారిని గట్టి దెబ్బ తీయడంలో నలుగురు పీఎల్‌జీఏ వీర యోధులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. బీజేలోను శత్రువుతో ఎదురుకాల్పుల్లో మనం నష్టాలను చవి చూశాం. ఈ విధమైన దాడుల సందర్భంగా మన బలగాలు కంబాట్ స్కిల్స్‌ను, టెక్నిక్స్‌ను నైపుణ్యంగా ఉపయోగిస్తూ, నష్టాలను వీలైనంత తగ్గించుకోవాలి.

శత్రువు ఆధునిక టెక్నాలజీ, ఇన్‌ఫార్మర్ల సమాచారంపై ఆధారపడి కొనసాగిస్తున్న దాడుల్లో మనం కొద్ది మంది ముఖ్యమైన కామ్రేడ్స్‌ను కోల్పోయాం. వీటిలో పేర్కొనదగినది దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ పవన్ అమరత్వం. కొత్తగా కొనుగోలు చేసిన రేడియోలో జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చి దాని ద్వారా మన కామ్రేడ్స్ వున్న లొకేషన్‌ను గుర్తించి శత్రువు పెద్ద దాడిని నిర్వహించాడు. శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతుక 'సమాధాన్' బహుముఖ దాడుల్లో భాగంగా ఎన్నో మోసపూరిత పద్ధతులను అవలంభిస్తున్నాడు. శత్రువు మన సరఫరాల వ్యవస్థలోకి చొచ్చుకుపోయి కంప్యూటర్లు, ప్రింటర్లు, రేడియోలు, పవర్ బ్యాంక్‌లు, సోలర్ ప్లేట్‌లు, వాకీటాకీలు మొదలైన ఎలక్ట్రికల్ వస్తువులలో జీపీఎస్ ట్రాకర్లు అమర్చి పంపుతున్నాడు. దీనిపట్ల మనం జాగరూకతతో వుంటూ నష్టాలకు గురికాకుండా చూసుకోవాలి. జీరగూడెం దాడి తర్వాత డిజిటల్ సర్వేలెన్స్‌లో భాగంగా డ్రోనుల ద్వారా నిఘా పెట్టి మన లొకేషన్‌ను గుర్తించి ఏప్రిల్ 19న శత్రువు ఆ లొకేషన్‌పై డ్రోనుల ద్వారా బాంబులు కురిపించాడు. అయితే రాత్రి డేరాను ఖాలి చేసిన కారణంగా మనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. భారత విప్లవోద్యమ చరిత్రలోనే ఇది మొట్టమొదటి సారి శత్రువు ఆకాశం నుండి బాంబులు వేశాడు. ఈ డ్రోన్ దాడి ఒక ప్రారంభం మాత్రమే. మునుముందు శత్రువు ఈ దాడులను తీవ్రం చేస్తాడు. అందువల్ల పై దాడుల నుండి కాపాడబడడం కోసం, వాటిని విఫలం చేయడం కోసం ఏయిర్ డిఫెన్స్-అఫెన్స్ ఎత్తుగడలను, డ్రిల్స్‌ను నిరంతరం ప్రాక్టిస్ చేయాలి. అందులో నైపుణ్యం సాధించాలి.

శత్రువు గత కొద్ది సంవత్సరాల కాలంగా మన సరఫరా వ్యవస్థలోకి చొచ్చుకుపోయి వివిధ రకాల తిండి సామాగ్రిని విషపూరితం చేస్తూ పంపడానికి అన్ని విధాల ప్రయత్నిస్తున్నాడు. అలాంటి విషపూరితమైన పధార్థాలను వినియోగించడం ద్వారా తెలంగాణకు చెందిన కొద్దిమంది కామ్రేడ్స్ అనారోగ్యం పాలయ్యారు. అయితే పార్టీ, పీఎల్‌జీఏ శ్రేణులు, డాక్టర్లు అందించిన సేవలతో వారి ఆరోగ్యం కుదుటపడింది. ఒక్క కామ్రేడ్ విజేందర్ అమరుడయ్యాడు. మనం మన అన్ని విధాల అవసరాల కోసం ప్రజలపై ఎక్కువగా ఆధారపడాలి. మనకు నష్టం కలిగించే అవకాశమేది శత్రువుకు ఇవ్వకూడదు. ప్రజల నుండి వేరుపడిపోయే బయటి తిండి వస్తువులను తెప్పించుకోరాదు. అలాగే మన సరఫరా వ్యవస్థలోకి శత్రువు చొరబడకుండా దాన్ని బలోపేతం చేసుకోవాలి.

దండకారణ్యంలోని ఒక ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ గంగాల్, డీవీసీ కామ్రేడ్ శోభరాయ్‌లను తీవ్ర అనారోగ్య స్థితిలో వైద్యం కోసం తెలంగాణలోని వరంగల్ పట్టణానికి పంపినపుడు వారిని పట్టుకుని వారికి కరోనా సోకినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ, వారిని ఆసుపత్రిలో భర్తీ చేసినట్లు నాటకమాడి, తెలంగాణ పోలీసులు వారిని నిర్ధాక్షిణంగా హత్య చేశారు.

బూబిట్రాప్‌లు, రిమోట్‌లు, మైన్ దాడులు నిర్వహించేటప్పుడు టెక్నికల్ నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి నిర్లక్ష వైఖరికి గురి కాకుండా వుంటూ ప్రమాధాల్లో జరిగే నష్టాల నుండి బయటపడాలి. గత సంవత్సరం ఇలా జరిగిన నష్టాలలో మనం డీకేలో డీవీసీఎమ్ కామ్రేడ్ సోమ్‌జీని కోల్పోయాం.

**కామ్రేడ్స్**

నేడు మన దేశంలో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెల్లడానికి అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులు ఎంతో అనుకూలంగా వుండగా, మరోవైపు దోపిడీ పాలకవర్గాలు తమ దోపిడీ, పాలనను కొనసాగించడం కోసం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. సామ్రాజ్యవాద ఆర్థిక ద్రవ్య సంక్షోభం మునుపెన్నడు లేని విధంగా తీవ్రం కావడంతో ప్రపంచంలో ప్రముఖ వైరుధ్యాలు రోజురోజుకు పదునెక్కుతున్నాయి. సామ్రాజ్యవాదుల సూపర్ లాభాపేక్ష, పర్యావరణ విధ్వంసం, ఆహారోత్పత్తుల అసహజ, వికృత ఉత్పత్తి పద్ధతుల కారణంగా ఉత్పన్నమయి ప్రపంచాన్ని కబలిస్తున్న కోవిడ్-19 కరోనా మహమ్మారి, దాన్ని నియంత్రించడం కోసం ప్రపంచవ్యాప్తంగా అమలు చేసిన, చేస్తున్న లాక్‌డౌన్ కారణంగా సాధారణ ప్రజల జీవితాలు దుర్భరమవుతున్నాయి. కోవిడ్ 2వ రౌండ్ వ్యాప్తి వల్ల భారతదేశం సహా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కోవిడ్‌ను నిరోదించడం కోసం చేపట్టిన వాక్సినేషన్, ఆరోగ్య రక్షణ కార్యక్రమాలను కూడా అత్యధిక లాభాలను సంపాదించే సాధనంగా వాడుకుంటున్నాయి.

సంక్షోభం సృష్టించిన పరిస్థితులతో విసిగివేసారిన కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి ప్రజలు గతం కంటే ఎక్కువ సంఖ్యలో రోడ్ల మీదికి వస్తున్నారు. అలాగే తమ పోరాటాలను తీవ్రం చేస్తున్నారు. ఈ సంవత్సరం మేడే సందర్భంగా ఫ్రాన్స్‌లోని అనేక పట్టణాలలో సామాజిక, ఆర్థిక న్యాయం కోసం 300 లకు పైగా ర్యాలీలు నిర్వహించారు. జీ-7 దేశాలలో ప్రజా పోరాటాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఫాసిస్టు, రేసిస్టు అమానవీయ పద్ధతులను చేపట్టి సామ్రాజ్యవాదులు ఈ పోరాటాలను అణచడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు. వీటి ఫలితంగా ప్రజా ఉద్యమాలు మరింత తీవ్రం-విస్తృతం అవుతున్నాయి. గత సంవత్సరం అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా సామ్రాజ్యవాద ఫాసిస్టు-రేసిస్టు స్వభావానికి ప్రతీకగా మారిన డొనాల్డ్ ట్రంప్ అపజయం పాలయ్యారు. దీన్ని అమెరికా పీడిత ప్రజల రేసిస్టు వ్యతిరేకత అభివ్యక్తిగా చూడవచ్చు. అయితే ఎన్నికలలో బైడెన్ గెలిచిన, మరెవరు గెలిచిన అమెరికా సామ్రాజ్యవాద విధానాలు మాత్రం మారవనేది తెలిసిందే.

మన దేశంలో బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు సంఘ్ పరివార్‌కు చెందిన భారతీయ జనతా పార్టీ మోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారం చేపట్టిననాటి నుండి ఒకవైపు భారత దేశాన్ని హిందు రాష్ట్రంగా మార్చే ఎజెండాను ఒక్కొక్క అడుగు ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు మన ప్రియమైన భారతదేశ ప్రకృతి సంపదలను, వనరులను, ప్రజల సంపదలను బహుళజాతి కంపెనీలకు, దేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులైన అంబానీ, అదాని లాంటి వాళ్లకు కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దాని దూకుడు మరింత పెరిగింది. తన హిందూ రాష్ట్ర నిర్మాణ ఎజెండాకు మోదీ 'నయా భారత్' అనే ఆకర్షణీయమైన పేరు పెట్టాడు. వాస్తవానికి ఇది మోదీ బుర్రలో పుట్టిన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భారతమే. దీన్ని ఆర్ఎస్ఎస్ స్థాపన సంవత్సరం 2025 వరకు పూర్తి చేయాలని ఉవ్విల్లూరుతున్నాడు. భారత పీడిత ప్రజలు మోదీ కలలను నిజం కానివ్వరు.

గత సంవత్సర కాలంలో మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' ముసుగులో దేశ నామమాత్రపు సార్వభౌమత్వాన్ని మొత్తంగానే తాకట్టుపెట్టే ఎన్నో చర్యలు చేపట్టాడు.

కొవిడ్ రెండవ రౌండ్ వ్యాప్తిని భాజాపా ప్రభుత్వం లాక్‌డౌన్ ద్వారా నిరోధించచూస్తున్నది. దీనితో కోట్లాదిమంది నిరుద్యోగులయ్యారు. దేశ జీడీపీలో నకారాత్మక పెరుగుదల నిరాటంకంగా కొనసాగుతున్నది. చిన్న దుకాణదారులు, వ్యాపారస్తులు, చిన్న పెట్టుబడిదారులు దివాళతీశారు. వాస్తవానికి వైరస్ వ్యాప్తికి స్వయంగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఎందుకంటే అది మహమ్మారి కాలంలో 5 రాష్ట్రాల ఎన్నికలను జరిపించింది. ఈ ఎన్నికల్లో భారి ర్యాలీలు నిర్వహించబడ్డాయి. అలాగే మూఢనమ్మకాలతో లక్షలాది మందితో కుంభమేళాలు నిర్వహించారు. మహమ్మారి వ్యాపించాడానికి ఇదొక ముఖ్యకారణమైంది. ఆత్మనిర్భర పేరుతో గత డిసెంబర్

వరకు ప్రపంచ మార్కెట్ నుండి వ్యాక్సిన్ కొనుగోలు చేయని కారణంగా దేశంలో తయారైన వ్యాక్సిన్‌ను విశ్వగురువు పేరుతో విదేశాలకు పంపే దౌత్యనీతి వల్ల కొవిడ్‌ను నిరోధించే వ్యాక్సినేషన్ కార్యక్రమం ఘోరంగా ప్రభావితమయింది. సామ్రాజ్యవాదుల సృష్టి అయిన ఈ విపత్తును కూడా అవకాశంగా మార్చుకుంటూ మోదీ దేశ, విదేశ కార్పోరేట్ దిగ్గజాల జేబులు నింపడానికి 20 లక్షల కోట్ల రూ.ల ప్యాకేజీని ప్రకటించాడు. దీంట్లో నుండి సాధారణ ప్రజల కోసం నామమాత్రంగానే ఖర్చు చేస్తున్నాడు. దేశాన్ని ఆహారధాన్యాల కోసం కూడ పరాధీనం చేస్తూ దేశ వ్యవసాయాన్ని అంటే సారవంతమయిన భూములు, ఉత్పత్తులు వాటి వ్యాపారంపై కార్పోరేట్ ఘరాణాల గుత్తాధిపత్యాన్ని స్థాపించేందుకూ మోదీ రైతు వ్యతిరేక దేశద్రోహకరమైన మూడు వ్యవసాయ చట్టాలను అమలులోకి తెచ్చాడు. వీటికి వ్యతిరేకంగా విశాల సమరశీల రైతు ఉద్యమం గత 6 మాసాలకు పైగానే కొనసాగుతున్నది. రైతులు ఢిల్లీని నలువైపుల చుట్టుముట్టి వున్నారు. వారిని ఢిల్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం దేశ సరిహద్దుల్లో కూడా కనిపించని రక్షణ చట్రాన్ని నిర్మించింది. ఈ ఉద్యమం కొనసాగుతున్న కాలంలోనే మూడు వందల మంది రైతులు తమ తనువులు చాలించారు. తన హిందుత్వ ఫాసిస్టు భారతదేశాన్ని నిర్మించే కలను నిజం చేయడానికి అనుగుణంగా భారతదేశ సామాజిక ఆర్థిక వ్యవస్థ ఉపరితలాన్ని ప్రభావితం చేసే ఉద్దేశంతో ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కాషాయికరణ, ఉన్నత స్థాయి కేంద్రికరణల మిశ్రమంగా మోదీ ప్రభుత్వం జాతీయ విద్యావిధానం పేరుతో నూతన విద్యా విధానాన్ని పార్లమెంటులో ప్రవేశ పెట్టకుండానే క్యాబినేట్ ఆమోదంతో అమలులోకి తెచ్చాడు. ఈ విద్యావిధానం అమలులోకి రావడం వల్ల దేశంలోని పేద ఆదివాసులు, దళితులు, అల్పసంఖ్యాక ముస్లింలు, వెనుకబడ్డ వర్గాల ప్రజలు విద్యకు, ప్రత్యేకించి ఉన్నత విద్యకు దూరం చేయబడతారు.

అయితే ఇందుకు ముందు నుండే దేశవ్యాప్తంగా లక్షలాది ప్రాథమిక, మిడిల్ స్కూల్లను మూసివేసి వాటి స్థానంలో కొన్ని వేల స్కూలు కాంప్లెక్సులను నిర్మిస్తున్నారు. పదుల, వేల పర్మినెంట్ ఉపాధ్యాయ పోస్టులను తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియ మరింత వేగవంతం కానున్నది.

కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ ప్రయోజనాలీడేర్చడానికి దేశ కార్మికుల ప్రయోజనాలను తుంగలో తొక్కి ప్రస్తుతం అమలులో వుండిన 40 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చివేసింది. దీనితో లక్షలాదిగా వున్న అసంఘటిత రంగ కార్మికులు(కాంట్రాక్ట్ కార్మికులు, క్యాజువల్ కార్మికులు, దినసరి కూలీలు) చెప్పనలవి కాని కష్టాలను ఎదుర్కోనున్నారు.

దేశంలో విద్యుత్తుకు ప్రముఖ వనరుగా వున్న బొగ్గు గనులను ప్రైవేటీకరించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కోల్ బ్లాక్ పంపిణీ విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీంతో దేశ ప్రజలు విద్యుత్ సేవల కోసం కార్పోరేట్ కంపెనీలపై ఆధారపడాల్సి వస్తుంది.

కాషాయ శక్తుల ద్వారా అయోధ్యలో బాబ్రీ మస్జీద్‌ను కూలగొట్టిన తర్వాత దాని స్థానంలో

రామ్ మందిర్ నిర్మాణానికి పునాదిరాయి వేయడం హిందుత్వ ఎజెండాలో భాగమే. మోదీ ప్రభుత్వం చేసిన సీఏఏ, ప్రస్థావిత ఎన్ఆర్సీ, ఎన్పీఆర్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్రమైన పోరాటం కొనసాగింది. ముస్లిం మహిళల అద్భుతమైన శాహిన్‌బాగ్ ఉద్యమంపై పోలీసుల సంరక్షణలో, వారి మద్దతుతో కాషాయ గుండాలు నిర్వహించిన హేయమైన దాడిలో 53 మంది ఆందోళనకారులు హత్యకు గురైనారు. దీని తరువాత దేశవ్యాప్తంగా ముస్లిం ప్రజల్లో ఆక్రోశం వెల్లువెత్తింది. ఇదే సంవత్సరం జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో మోదీ చిత్తయ్యాడు. అన్ని పార్లమెంటరీ పార్టీలు కార్పోరేట్ ప్రయోజనాలను కాపాడేవే అయినప్పటికీ ప్రతిపక్షరహిత భారతదేశాన్ని నిర్మించాలనే మోదీ కుటిల ఉద్దేశాలపై నీళ్లు చల్లడంలో ఈ ఎన్నికలు సఫలమయ్యాయి. కాషాయ శక్తిని మరింత బలోపేతం విస్తృతం చేసే మోదీ మార్గంలో ప్రజలు సృష్టించిన అడ్డంకులుగా ఈ ఎన్నికలను చూడవచ్చు.

ఉన్నత కులాలుగా పిలువబడే వారి ఆధిపత్యాన్ని కొనసాగించడంలో భాగంగా గోరక్షణ సహా వివిధ సాకులతో దేశంలోని మెజారిటీ రాష్ట్రాలలో కాషాయ గుండాల ద్వారా లేదా వారి సంరక్షణలో దళితులపై అమానవీయమైన అత్యాచారాలు కొనసాగుతున్నాయి. దళిత చైతన్యానికి ప్రతీకగా మారిన భీమా కొరెగాం అస్థిత్వాన్ని రూపుమాపడం కోసం తప్పుడు కేసులు బనాయించి దేశంలోని ప్రముఖ ప్రగతిశీల ప్రజాస్వామిక మేధావులు, మానవ హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు, రచయితలు, కళాకారులపై దాడులు, అరెస్టులు గత మూడు సంవత్సరాలలో వరుసగా పెరుగుతున్నాయి. దీనితో దళితులు, దేశభక్త శక్తులు, ప్రజాస్వామికవాదుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతున్నది. జాతీయ విముక్తి ఉద్యమాలను అణచివేయడంలో భాగంగా కశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్షలను తుంగలో తొక్కుతూ రాజ్యాంగంలోని సెక్షన్ 370, 35ఏ లను రద్దు చేయడంతో కశ్మీర్ ప్రజల్లో భారత ప్రభుత్వం పట్ల విద్వేషం మరింత పెరిగింది. సామ, ధాన, భేద దండోపాయల ద్వారా ఈశాన్య జాతుల విముక్తి పోరాటాలను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

దోపిడీ వర్గాల అధికారాన్ని, దోపిడీని నిలబెట్టడంలో భాగంగా మోదీ ప్రభుత్వం ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించేందుకు వర్గ పోరాటం, ప్రజాయుద్ధాన్ని నిర్వహిస్తున్న మన పార్టీ, పీఎల్జీఏ, ప్రజా రాజ్యాధికార సంస్థలను మొత్తంగా చెప్పాలంటే భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించే ఉద్దేశంతో మే 2017 నుండి ప్రతీఘాతుక వ్యూహాత్మక అణచివేత పథకాన్ని అమలు చేస్తున్నది. దీంట్లో భాగంగా 'మే' 2017 నుండి 'సమాధాన్'ను అమలుచేస్తున్నది. దీంట్లో భాగంగా పోరాట ప్రాంతాల్లో పోలీసు, అర్ధసైనిక, కమాండో సైన్య బలగాలతో కొత్తకొత్త క్యాంపులను ఏర్పాటు చేస్తు కార్పెట్‌సెక్యూరిటీ వ్యవస్థను పటిష్టం చేస్తున్నది, విస్తరిస్తున్నది. ఈ క్యాంపుల ద్వారా నిరంతరం దాడులు నిర్వహిస్తున్నది. 2020 జనవరి నుండి ప్రహార్ పేరుతో దాడులను

ముమ్మరం చేసింది. దండకారణ్యంలో నవంబర్ 2020 నుండి 10 ఎత్తుగడలతో 'సమాధాన్', 'ప్రహార్' నిర్ణాయక దాడులను కొనసాగిస్తున్నది. ఈ సమాధాన్, ప్రహార్ దాడులు దేశంలోని అన్ని వర్గపోరాట, ప్రజాయుద్ధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. వేరువేరు ఉద్యమ ప్రాంతాల్లో, వేరువేరు పద్ధతుల్లో ఈ దాడులు కొనసాగుతున్నాయి. పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ, ప్రజా నిర్మాణాలు, విప్లవ ప్రజానికం ఈ సమాధాన్ దాడులను ధైర్య సాహసాలతో ఎదుర్కొంటున్నారు. అయితే ఈ ప్రతిఘటనలో మనం ఇప్పటివరకు ఎంతో నెత్తురు ధారపోశాం. శత్రువు 'సమాధాన్' ద్వారా 2022 మే, వరకు దేశ విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యం పెట్టుకున్నాడు. ఇది అసాధ్యం. భారత ప్రజల విముక్తి కోసం ఈ నెత్తుటి త్యాగాలు అవసరమైనవే అయితే వీలైనంత తక్కువ నష్టాలతో మనం మన లక్ష్యాన్ని సాధించాలి. అసమాన ధైర్య సాహసాలతో అచంచల విశ్వాసంతో లక్ష్యం పట్ల గట్టి పట్టుదలతో, చొరవతో ముందుకు సాగాలి. మనకు లభించే అన్ని అవకాశాలను సరిగ్గా ఉపయోగించుకుంటూ వేరువేరు పోరాట ప్రాంతాల్లోని నిర్దిష్ట పరిస్థితికి అనుగుణంగా చిన్న, మధ్య రకం అలాగే అత్యంత అనుకూల పరిస్థితుల్లో పెద్ద గెరిల్లా చర్యలను నిర్వహించడం ద్వారా ప్రజాయుద్ధాన్ని, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం విస్తృతం చేయాలి. కార్పొరేట్‌సెక్యూరిటీ వ్యవస్థ మధ్యనే బలమైన రహస్య పార్టీని నిర్మిస్తూ వర్గ పోరాటాన్ని తీవ్రతరం, విస్తృతం చేయాలి. ఈ విధంగా శత్రువు కొనసాగిస్తున్న సమాధాన్‌కు దీటుగా జవాబిస్తు దాన్ని ఓడించే దిశగా ముందుకు సాగాలి. 'సమాధాన్' దాడులను గత నాలుగు సంవత్సరాలుగా ఎదుర్కొన్న అనుభవం మనకుంది. దండకారణ్యం, జార్ఖండ్, ఏఓబీ ప్రాంతాల ప్రజలు పోలీసు క్యాంపులకు, వాటి ద్వారా తాము నిర్వాసితులు కావడానికి వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక ఆర్థిక, పారిశ్రామిక గనుల, కార్మిక, వ్యవసాయ, విద్యా, వైద్య విధానాల కారణంగా, దళిత–ఆదివాసీ–ముస్లిం వ్యతిరేక విధానాల కారణంగా దేశంలోని అన్ని పీడిత వర్గాల సామాజిక సెక్షన్ల ప్రజలు ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కోపోద్రేకాలతో ఉద్యమిస్తున్నారు. వీటి పునాదిపై వీటి ప్రజా పోరాటాలను, ప్రజా ప్రతిఘటనలను, ప్రజాయుద్ధాన్ని సమన్వయంతో కొనసాగిస్తూ మనం మన లక్ష్యాన్ని సాధించగలం.

కామ్రేడ్స్

పైన పేర్కొన్న అనుకూల అంతర్జాతీయ దేశీయ పరిస్థితులను సరిగ్గా వినియోగించుకునేలా పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనల రంగాలకు చెందిన అన్ని శ్రేణుల రాజకీయ, భావాజాలపరమైన, నిర్మాణపరమైన, సైనిక, సాంస్కృతిక స్థాయిని పెంపొందిస్తూ అన్ని పీడిత వర్గాల ప్రత్యేక సామాజిక సెక్షన్ల ప్రజలను వర్గ పోరాటం, ప్రజాయుద్ధంలో సమీకరిద్దాం. సామ్రాజ్యవాద వ్యతిరేక దళారీ

నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం. ప్రస్తుతం దోపిడీ పాలకవర్గాలకు తొత్తుగా మారి వారికి సేవలనందిస్తున్న బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా విస్తృత, సమరశీల, సంఘటిత ప్రజాందోళనను నిర్మిద్దాం. మోదీ కలలు కంటున్న హిందుత్వ ఫాసిస్టు భారత్ నిర్మాణాన్ని విఫలం చేద్దాం. నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించే దిశగా అడుగు ముందుకు వేద్దాం. ఇదే మన ప్రియమైన అమరుల ఆశయం. వారి ఆశయాలను తుదకంటా కొనసాగించేందుకు చివరిశ్వాస వరకు విరామం ఎరుగక శ్రమిద్ధామని దీక్ష పూనుదాం. ఇదే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళి.

అమరుల త్యాగాలను వృధా కానివ్వం

ప్రజా పోరాటాలను, ప్రజాయుద్ధాన్ని దేశవ్యాప్తంగా తీవ్రతరం-విస్తృతం చేయడం ద్వారా శత్రువు కొనసాగిస్తున్న 'సమాధాన్', 'ప్రహార్' దాడులను ఓడిద్దాం.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

## అమరుల వారోత్సవాల కార్యక్రమం

1. అమరుల వారోత్సవాల సందర్భంగా వాడవాడలలో, గ్రామగ్రామాన పట్టణాలలో అక్కడి నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా బహిరంగా, రహస్య పద్ధతుల్లో అమరుల స్మృతిలో చిన్న పెద్ద సంస్మరణ సభలను నిర్వహించి కేంద్రకమిటీ సందేశాన్ని ప్రజల వద్దకు చేర్చాలి. అమరుల కుటుంబ సభ్యులను ఈ సభలకు ఆహ్వానించాలి, వేదికపై కూర్చోబెట్టాలి, సభాముఖంగా వారిని పరిచయం చేయాలి. వీలును బట్టి మాట్లాడించాలి.
2. అమరుల కుటుంబ సభ్యులకు సంతాప సందేశాన్ని వారి జీవిత చరిత్రలను, ఫోటోలను, వారి జ్ఞాపక చిహ్నాలను అందించాలి. వారి సుఖ దు:ఖాలలో పాల్గొంటూ వివిధ రూపాలలో వారికి అవసరమైన మద్దతునందించాలి. అమరుల స్ఫూర్తితో వారిని విప్లవోద్యమం పక్షాన గట్టిగా నిలబెట్టేల ఎడ్యూకేట్ చేయాలి.
3. స్పెషల్‌జోన్/రాష్ట్రం/స్పెషల్ ఏరియా వారిగా, డివిజన్/జిల్లా/జోన్ వారిగా మరియు ప్రాంతాల వారిగా అమరుల జీవిత చరిత్రలను ప్రచురించాలి. అమరుల త్యాగాలను ఆదర్శాలను, వారి మంచి అలవాట్లను ఎత్తిపడుతు కరపత్రాలు, పోస్టర్లు, బ్రౌచర్లు, బ్యానర్లు, విడుదల చేయడంతో పాటు వారిపై కవితలు, కథలు, నాటకాలు రచించి

ప్రచురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. దీని కోసం ప్రింటింగ్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాను అవసరమైన జాగ్రత్తలతో ఉపయోగించుకోవాలి. అమరుల స్థూపాలను వేరువేరు చోట్ల నిర్మించి ఆవిష్కరించాలి.

4. విప్లవ సాంస్కృతిక సంఘాల ద్వారా అమరుల జీవిత చరిత్రలను, వారి త్యాగాలపై పాటలు, గ్రూప్ సాంగ్స్, గ్రూప్ డాన్స్, నాటికలు మొదలయిన వివిధ కళారూపాలను తయారుచేసి ప్రత్యక్షంగా ప్రదర్శనలు ఇవ్వాలి. అలాగే డిజిటల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేయాలి.

5. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని పై కార్యక్రమాలను అమలు చేయాలి. మన ప్రియమైన అమరుల అత్యున్నత త్యాగాల స్ఫూర్తితో శత్రువు ప్రహార్ దాడులను ఓడించేలా ప్రజలను రాజకీయంగా ఎడ్యుకేట్ చేసుకునే క్యాంపెయిన్ లాగా అమరుల వారోత్సవాలను నిర్వహించాలి.

## నినాదాలు

- ☆ మన పార్టీ సంస్థాపక నాయకులు, ఉపాధ్యాయులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీలకు ఎర్రెర్ర దండాలు !
- ☆ అమరవీరులందరికీ జోహర్లు !
- ☆ అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం !
- ☆ అమరుల త్యాగాలను ఎత్తిపడుదాం !
- ☆ ప్రతిఘాతుక వ్యూహాత్మక అణచివేత పథకం 'సమాధాన్', 'ప్రహర్' దాడులను ఓడిద్దాం!
- ☆ దండకారణ్య డ్రోన్ దాడులను నిరసిద్దాం !
- ☆ దండకారణ్యంలో భారత సైన్యాలను దింపడాన్ని వ్యతిరేకిద్దాం !
- ☆ గెరిల్లా యుద్ధ నియమాలను ఖచ్చితంగా అమలుచేద్దాం !
- ☆ అనవసర నష్టాల నుండి బయటపడుదాం !
- ☆ దండకారణ్యం, బీహార్–జార్ఖండ్, తూర్పు బీహార్–ఈశాన్య జార్ఖండ్‌లను స్థావర ప్రాంతాలుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పని చేద్దాం !
- ☆ సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని తీవ్రతరం–విస్తృతం చేద్దాం !
- ☆ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేద్దాం !
- ☆ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ఓడిద్దాం ఓడిద్దాం !
- ☆ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి !
- ☆ ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి !

☆ సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానం నశించాలి!

☆ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జిందాబాద్ !

☆ మార్క్సిజం, లెనినిజం, మావోయిజం జిందాబాద్ !

జూన్ 20, 2021

**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**